సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

- పంపిణీకి సిద్ధంగా ఉన్న జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు

భువనగిరిటౌన్ : మరికొద్ది రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని భూములను సిద్ధం చేస్తున్నారు. అయితే రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసేందుకు వ్యవసాయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. జిల్లా కో అపరేటివ్ సొసైటీలో 990 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. ప్రతి ఏడాది ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఈ విత్తనాలను సరఫరా చేస్తున్నా రైతులకు వాటి వినియోగంతో కలిగే లాభాలపై సరైన అవగాహన లేకపోవడంతో పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదు. సారం కోల్పోయిన భూముల్లో మంచి దిగుబడులు వచ్చేలా చేయాలంటే సంప్రదాయ ఎరువులైన జీలుగ, పచ్చిరొట్ట, పిల్లిపెసర వంటి వాటిని పంటకు ముందు భూములలో పెంచితే భూసారం పెరిగే అవకాశం ఉందని రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పచ్చిరొట్టతో ప్రయోజనాలెన్నో..

రసాయనాలు, ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల భూమిలోని సారం పూర్తిగా తగ్గిపోయి పంటల దిగుబడులు పడిపోతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తలు సేంద్రియ, సహజసిద్ధమైన పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించి పంటలు పండించాలని సూచిస్తున్నారు. భూసారం పెంచడం కోసం జీలుగ, పిల్లిపెసర, జనుము పంటలను వరి సాగుకు ముందు పొలంలో పెంచడంతో భూసారం పెరగనుంది. నేల స్వభావాన్ని బట్టి ఆయా పంటలను సాగు చేసుకోవడం వల్ల నేల క్షీణతను తగ్గించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నెల రోజులకు ముందు జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలను చల్లుకోవాలి. నాటు వేసే నాటికి పెరిగిన ఆ మొక్కలను పొలంలోనే కలియదున్నాలి. ఈ విధంగా చేయడం వల్ల గాలిలో ఉండే నత్రజని భూమిలో ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా ఈ పంటలు సహకరిస్తాయి. విత్తనాలు చల్లిన నాటి నుంచి 25 నుంచి 30 రోజుల్లోనే పంట ఏపుగా పెరుగుతుంది. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరం ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి, లేదా రోటోవేటర్ సహాయంతో కలియదున్నాలి. అనంతరం సూపర్ ఫాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలి. సూపర్ ఫాస్ఫేట్‌తో మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువులుగా తయారవుతాయి.


జీలుగ సాగును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

విత్తనాల ధరలు ఇలా..

30కేజీల జీలుగ సంచికి రూ.2790/- రూపాయలు ఉండగా సబ్సిడీ రూ. 1674 పోగా రూ.1116లు రైతులు చెల్లించాల్సి ఉంటుంది. 40 కేజీల జనుము సంచికి రూ. 3620 ఉండగా సబ్సిడీ రూ. 2172 పోను రూ.1448 చెల్లించాల్సి ఉంటుంది. 20 కేజీల పిల్లి పెసర సంచికి రూ.2710 ఉండగా సబ్సిడీ రూ. 1626 పోను రూ.1084 చెల్లించాల్సి ఉంటుంది. ఈ విత్తనాలు జిల్లాలోని అన్ని కోఆపరేటివ్ సొసైటీలలో అందుబాటులో ఉన్నాయి.

పంటల దిగుబడి పెరుగుతుంది

జిల్లాలో కురుస్తున్న వర్షాలు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. భూసారం పెంచుకోవడం కోసం రైతులు భూమిలో జీలుగు, పిల్లిపెసర, జనుము వంటి విత్తనాలను చల్లుకుంటే పంటల దిగుబడి పెరుగుతుంది. నాట్లు వేసుకునే నాటి వరకు ముందస్తుగా భూమిలో జీలుగ విత్తనాలను చల్లుకుంటే మంచి ఫలితం ఉంటుంది. వస్తుంది.

– అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారిణి

ప్రతి ధాన్యపు గింజను కొంటాం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొంటామని.. రైతులెవ్వరూ ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగార్జున రైస్‌మిల్లును సందర్శించి ధాన్యం స్టాక్‌ను పరిశీలించారు. మిల్లర్లు ధాన్యం లారీలను వెంటనే దిగుమతి చేసుకుని రైతులకు సహకరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పోచంపల్లి మండలంలో 43వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. మరో 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలో 75శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ధాన్యాన్ని ఈ నెలాఖరువరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లారీల సమస్య వల్ల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగిందని, అధికారులతో ఎప్పటికపుడు మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. పోచంపల్లి మండలంలో రైస్‌మిల్లర్లు, లారీ యజమానుల మధ్య జరిగిన గొడవతో కొంత జాప్యం జరిగిందన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడకుండా ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, డీసీసీ ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహ రెడ్డి, సామ మోహన్‌రెడ్డి, గునిగంటి రమేశ్, ఉప్పునూతుల వెంకటేశం, ప్రకాశ్‌రెడ్డి, అనిరెడ్డి జగన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కందాడి యాదిరెడ్డి, వెంకటేశ్, కుక్క కుమార్, కుక్క స్వామి, రుద్ర చందు, కీర్తి సంజీవ, చెన్నబత్తిని యాదగిరి, ఈదయ్య, పానుగంటి లింగస్వామి, సుర్వి వెంకటేశ్ పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బెస్ట్ సర్వీస్ అవార్డులకు ఎంపిక

రామన్నపేట : మాతృదేవోభవ – పితృదేవోభవ సంస్థ ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఇవ్వనున్న బెస్ట్ సర్వీసు అవార్డులకు మండలానికి చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. నీర్నెముల గ్రామానికి చెందిన నోముల యాదగిరి, కక్కిరేణి చెందిన వేముల సైదులు, సోమనబోయిన శ్రీమాన్‌లను ఎంపిక చేసినట్లు సోమవారం సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 23న హైదరాబాద్‌లో జరిగే వేడుకల్లో సినీ హీరో చిరంజీవి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి


కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

గుండాల : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేసే వరకు ప్రభుత్వంతో పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వారితో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో తూకం వేసిన బస్తాలు మిగిలి పోతున్నాయని.. మిల్లులకు వెళ్లిన ధాన్యానికి బస్తాకు కిలో చొప్పున తరుగు తీస్తున్నారని తెలిపారు. కొనుగోలు సెంటర్‌కు లారీ రావాలంటే బస్తా ఒక్కంటికి రూ.5 వసూలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామంలో జరిగిన లింగమంతుల స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మందడి రామకృష్ణారెడ్డి, సోమన్న, రాజు, స్వామిరావు, పిట్టల చందు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న దూడల భిక్షంగౌడ్

చౌటుప్పల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ గెలుపునకు ప్రత కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. . పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తులను కాకుండా క్రమశిక్షణతో నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలుగా పని చేస్తున్న ప్రేమేందర్‌రెడ్డికి పట్టభద్రులంతా ఓటు వేయాలని కోరారు. ఓటర్లు ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గుజ్జుల ప్రేమేందర్‌కు వేసి గెలిపించుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకుగాను బీజేపీకి అవకాశం ఇవ్వాలన్నారు. బీజేపీ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బత్తుల జంగయ్య, మండల అధ్యక్షుడు చినుకని మల్లేశం, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి, కైరంకొండ అశోక్, వనం ధనుంజయ్య, ఊడుగు వెంకటేశం, కడవేరు పాండు, బాతరాజు సత్యం, కాసుల వెంకటేశం, అయిలయ్య, చీకూరి ప్రభాకర్, మొగులయ్య, రవి, పాల్గొన్నారు.

గుజ్జుల ప్రేమేందర్‌ను గెలిపించాలి

ఆత్మకూరు(ఎం): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు దాసరి మల్లేష్, కరుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, బొట్టు అబ్బయ్య, బొబ్బల ఇంద్రారెడ్డి, సత్యనారాయణ, తవిటి రాంరెడ్డి, యాస వెంకట్ రెడ్డి, మేడి సాగర్, వెంకటయ్య పాల్గొన్నారు.

సుబ్బూరు సత్తయ్యకు నివాళి


సత్తయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

భువనగిరి రూరల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో సోమవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మామ సుబ్బూరు సత్తయ్య సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని సత్తయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, లక్ష్మారెడ్డి, మందుల సామేల్, డీసీసీ అధ్యక్షుడు అన్నెపు సంజీవరెడ్డి, జెడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి, నాయకులు మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, పొత్తంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, పోత్నక్ ప్రమోద్ కుమార్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, చిన్నం పాండు, జమ్ముల రమేష్, కంచి మల్లయ్య, కల్లె మల్లేశ్, శోకం రాజశేఖర్, భాను, ఎలెందర్ పాల్గొన్నారు.

ఐయిలి అంజయ్యకు..

మోటకొండూర్: మండలంలోని ఇక్కుర్తి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ఐయిలి అంజయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ సోమవారం అంజయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మల్లేష్, దడిగె రాములు, బొడిగె దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాజాపేట : ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ సర్పంచ్ జెన్నపల్లి జ్యోతి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాముకుంట గ్రామంలో భువనగిరి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులు బాలీజీ, డాక్టర్ జయశ్రీ, స్పందన, ఉపేందర్ రావు, ఫార్మసిస్టు సంతోష్, లక్ష్మణ్, ఏఎన్ఎం ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

భువనగిరిటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో జరిగిన భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులందరూ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రచార కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల, పీసీసీ కార్యదర్శి తంగెల్లపల్లి రవికుమార్, మున్సిపల్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, అసెంబ్లీ అధ్యక్షులు అవేస్ చిస్తీ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణ మహోత్సవం

రామన్నపేట : మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో శ్రీ లక్ష్మీగణపతి సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శివకోటి దివ్య–సతీష్ దంపతుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నార్మాక్స్ మాజీ చైర్మెన్ గంగుల క్రిష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ ముక్కాముల కవితాదుర్గయ్యయాదవ్, వైస్‌చైర్మన్ దేసాజు బ్రహ్మచారి డైరెక్టర్లు బొడిగె భూపాల్, కంచి శంకర్, ఎర్ర నర్సింహ, జక్కల మల్లేష్, కొండకింది శేఖర్‌రెడ్డి, ముక్కాముల పాపయ్య, బొడిగె శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

సామాజిక సేవే కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ లక్ష్యం


విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్న కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి : సామాజిక సేవే కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ లక్ష్యమని రాష్ట్ర యువజన సంఘం అవార్డు గ్రహీత, కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలోని కేవీటీ కోవెల భవనంలో కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ 35వ వార్షికోత్సవం, కర్నాటి వెంకటేశం 57వ జయంతిని పురస్కరించుకుని యజ్ఞం నిర్వహించారు. అనంతరం ఎస్సెస్సీలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులైన ఆకుల విశాల్‌తేజ, అర్థం లోకేశ్, సిద్దగోని శ్రీతేజలను శాలువా కప్పి సన్మానించి ఒక్కొక్కరికి రూ.1016ల చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. నిరుపేద మహిళలకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఏలే ఉమాశంకర్, రాజారమేశ్, కృష్ణకుమార్, తడక యాదగిరి, వలందాస్ మహేశ్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై కేసు

వలిగొండ : మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై మహేందర్ లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన పోలేపాక విష్ణు (20) మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని బాధితురాలి తలిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

కార్మిక చట్టాలపై అవగాహన


కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

భువనగిరి క్రైమ్ : అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు కార్మిక శాఖ అమలు చేస్తున్న పథకాలు, చట్టపరమైన హక్కుల గురించి సోమవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉచిత సలహ మండలి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఎస్.జైపాల్, డిప్యూటీ లీగర్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది జి.శంకర్‌లు మాట్లాడుతూ న్యాయ సహయం, ఉచిత న్యాయ సలహాల కోసం కోర్టులలో ఏర్పాటైన న్యాయ సేవా సంస్థల నుంచి పొందవచ్చన్నారు. జూన్ నెల 8న జాతీయ లోక్ అదాలత్ అ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం న్యాయ సేవల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


వలిగొండ : ఆర్థికసాయం అందజేస్తున్న లక్ష్మారెడ్డి

వలిగొండ : మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన కందుల దిలీప్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుర్రం లక్ష్మారెడ్డి సోమవారం బాధిత కుటుంబానికి రూ. 5 వేలు, అదేవిధంగా ఇటీవల మృతి చెందిన కేశవదాసు లక్ష్మీనారాయణ్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నోముల మల్లేష్,సిరికొండ జహంగీర్,కందుల శ్రీను,కందుల మహేష్,బోదాసు బాలరాజు, చిట్టబోయిన రమేష్, సుంకరి నర్సింహ, కందుల నవీన్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని తిరుమలగిరి పంచాయతీ కార్మికురాలు మైలారం సుగుణ ఇటీవల మృతి చెందింది. మాజీ సర్పంచ్ నూనవత్ అశోక్ సోమవారం మృతురాలి కుటుంబానికి రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బీబీనగర్ : బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ప్రతిఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు మాధవి బాలకృష్ణ అన్నారు. మండలంలోని జైనపల్లి గ్రామంలో ఉపాధికూలీలకు సోమవారం ఎస్ఎస్‌టీ, ఎన్‌జీఓల ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకుల పేరుతో సైబర్ నేరగాళ్లు పంపిన లింకులు ఓపెన్ చేసి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ పలువురు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తుర్కపల్లి: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని వెంకటగిరి లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పురోహితులు వెన్నకూచి రమాకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం పతకావిష్కరణ, మూలమూర్తులకు అభిషేకాలు,అర్చనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కల్లూరి నర్సింహ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజుకుమార్, రవి, బిక్షపతి, నరేశ్, నారాయణరెడ్డి, లక్ష్మీనర్సయ్య, పాపయ్య పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు.. విద్యార్థుల అవస్థలు


అర్థాంతరంగా నిలిచిపోయిన కళాశాల ప్రహరీ నిర్మాణ పనులు


టెలిఫోన్ స్తంభాలకు బిగించిన కళాశాల నేమ్‌బోర్డ్


ఒకేషనల్ కోర్సు బ్లాక్‌లో స్లాబ్‌వేసి వదిలేసిన అదనపు తరగతి గది


పాత సైన్స్ గ్రూపుల భవనంపై నిలిచిపోయిన అదనపు తరగతి గది నిర్మాణ పనులు

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో కళాశాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పదేళ్లక్రితం చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు స్లాబ్ దశలోనే నిలిచిపోయాయి. కాగా గతేడాది అక్టోబర్ నెలలో కళాశాల ప్రహరీ నిర్మాణానికి డీఎంఎఫ్ నుంచి రూ. 10లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో మంత్రుల పర్యటన నేపథ్యంలో హడావిడిగా ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆ పనులను నిలిపివేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికైనా అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టభద్రులంతా ఆలోచించి ఓటేయాలి


మాట్లాడుతున్న పూస శ్రీనివాస్

భువనగిరి క్రైమ్ : పట్టభద్రులందరూ ఆలోచించి ఓటేయాలని తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ సమితి పార్టీ అభ్యర్థి పూస శ్రీనివాస్ అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజల హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తున్న తనను ఆదరించి ఎమ్మెల్సీ మొదటి ప్రాధాన్యత ఓటేయాలన్నారు. తనను గెలిపిస్తే ప్రజా సమస్యలపై చట్ట సభలో పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

చౌటుప్పల్: పట్టణ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు సోమవారం ఫిర్యాదు అందిందని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో నివాసముంటున్న జెనిగెల మల్లేష్(35) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

ఎర్త్ వైర్‌ను తొలగించాలి


వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

భువనగిరి : పట్టణంలోని అర్బన్‌కాలనీలో శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు మధ్య ఉన్న ఎర్త్ వైర్‌ను తొలగించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయంలో సబ్ ఇంజనీర్ గౌతమికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మహిళా జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, పార్టీ పట్టణకార్యదర్శి పుట్ట రమేష్, అభిలాష్, పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేష్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబు


కోదండ రామస్వామి ఆలయం

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయం వార్షిక ఉత్సవాలకు ముస్తాబవుతుంది. ఈ నెల 23న నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న సుప్రభాతం, హనుమాన్ పూజ, బాలభోగం, 23న సీతారాముల కల్యాణ మహోత్సం, 24న బండ్ల ప్రదక్షణ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా లింగమంతుల జాతర


జాతరలో పాల్గొన్న గొంగిడి మహేందర్‌రెడ్డి

గుండాల : మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలో సోమవారం లింగమంతుల జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో టిస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ యాదగిరితో పాటు పిట్టల చందు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణ మహోత్సవం

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం అభిషేకాలు, లక్షపుష్పార్చన, పల్లకీ ఊరేగింపు సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నార్త్ వెస్ట్ ఢిల్లీ ఎన్నికల పరిశీలకుడిగా ఉపేందర్ రెడ్డి



మోత్కూరు : నార్త్ వెస్ట్ ఢిల్లీ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా మున్సి పాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చింతల ఉపేందర్‌రెడ్డిని నియమిస్తూ ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ ఉదిత్‌రాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అదిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి రూరల్ : పట్టణంలోని సింగన్నగూడెం వద్దగల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ పలువురు లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేపూరి సుధాకర్, స త్యం, సాయి, హరికష్ణ, శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీదేవి, మంజుల, శ్రీలత, ఆశ, శంకర్, శివ పాల్గొన్నారు.

25న శిక్షణ శిబిరం

మర్రిగూడ : గ్రామ భారతి ఆధ్వర్యంలో ప్రకృతి గో ఆధారిత ఉత్పత్తులపై సేంద్రియ వ్యవసాయ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మర్రిగూడ గ్రామ భారతి అధ్యక్షురాలు ఎం .సూర్యకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొమ్మలరామారం మండలం పెద్ద పర్వతపురం శ్రీసాయిధామం వద్ద ఈ నెల 25న ఈ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు 9490850766, 9121998091 నంబర్లను సంప్రదించాలని కోరారు